# సంఘములో దేవుని శక్తిని అంచనా వేయుట : మునుపటి శక్తి ఏమాయెను?

'అంచనా వేయుట' అనగా నేనేమనుకొంటున్నానో న్యాయాధిపతులు 6వ అధ్యాయం లోని 12 మరియు 13 వచనాలు బహు చక్కగా వివరిస్తున్నాయి. ఆ భాగంలో యెహోవా దూతకు గిద్యోను ఇచ్చిన ఈ జవాబును గమనించండి :

> **"యెహోవా దూత గిద్యోనుకు కనబడి, పరాక్రమముగల బలాఢ్యుడా, యెహోవా నీకు తోడైయున్నాడు అని అతనితో అనగా గిద్యోను చిత్తము నా యేలినవాడా, యెహోవా మాకు తోడైయుండినయెడల యిదంతయు మాకేల సంభవించెను? యెహోవా ఐగుప్తులో నుండి మమ్ము రప్పించెనని చెప్పుచు మా పితరులు మాకు వివరించిన ఆయన అద్భుత కార్యములన్నియు ఏమాయెను? యెహోవా మమ్మును విడిచిపెట్టి మిద్యానీయుల చేతికి మమ్మును అప్పగించెనని అతనితో చెప్పెను."**

ఇశ్రాయేలీయులలో ప్రతివాడునూ తన ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూవున్న మిక్కిలి కఠినమైన కాలంలో గిద్యోను నివసించాడు. ఇశ్రాయేలులో ఒకప్పుడు సంతోషకరమైన దినములుండెనని గిద్యోనుకు తెలుసు. అటువంటి సంతోషకరమైన పరిస్థితి తన కాలంలో లేకపోవడం గిద్యోనును కలవరపరిచింది. కాబట్టి అతడు ఈ విధంగా ప్రశ్నించడం ప్రారంభించాడు :

- ఈ కీడంతా మాకెందుకు సంభవించింది?
- మా పితరులు మాకు వివరించిన అద్భుతకార్యాలన్నీ ఏమయ్యాయి?
- ఆ అద్భుత కార్యాలు ఇప్పుడెందుకు సంభవించడం లేదు?

ఈ రోజుల్లో దేవుని ప్రజల పరిస్థితిని పరిశీలించినప్పుడు మనంకూడ ఇదే విధంగా ప్రశ్నిస్తాము :

- మన మధ్యలో ఆత్మీయ శక్తి అతి తక్కువ స్థాయిలో ఎందుకు అగుపడుతోంది?

- అపొస్తలుల కార్యముల గ్రంథములోని ఆశీర్వాదాలు ఆ కాలం వరకే పరిమితమా?
- దేవుని ప్రజలు ఇంత బలహీనంగానూ ఇన్ని విభజనలతోనూ ఎందుకున్నారు?
- స్థానిక సంఘాల్లో ఆత్మీయ శక్తిని అనుభవించడానికి ఉండవలసిన పరిస్థితులేవి? ఆ శక్తిని మనమెలా గుర్తించగలము?

ఆత్మీయ శక్తినిగూర్చి మనకు విశదీకరించే ఈ క్రింది మూడు వచనాలను మనము జాగ్రత్తగా పరిశీలిద్దాం :

**"పరిశుద్ధాత్మ మీమీదికి వచ్చినప్పుడు మీరు శక్తి నొందెదరు గనుక మీరు నాకు సాక్షులైయుందురు." (అపో.కా. 1:8).**

**"దేవుడు మనకు శక్తియు, ప్రేమయు ఇంద్రియ నిగ్రహము గల ఆత్మనే యిచ్చెనుగాని పిరికితనముగల ఆత్మనియ్యలేదు." (2 తిమోతి 1:7).**

**"ఆనందముతో కూడిన పూర్ణమైన ఓర్పును దీర్ఘశాంతమును కనుపరచునట్లు ఆయన మహిమ శక్తినిబట్టి సంపూర్ణ బలముతో బలపరచబడవలెనని ..." (కొలస్సీ 1:12).**

ఆత్మీయ శక్తిని గురించిన కొన్ని విషయాలను పై వచనాలలో గమనించండి. మనలను మనము ఘనపరచుకోడానికి లేదా పరిశుద్ధాత్మను ఘనపరచడానికి ఆత్మీయ శక్తి ఇవ్వబడలేదుగాని, మనము ఈ లోకంలో క్రీస్తు కొరకు సాక్షులముగా జీవించాలన్న ఉద్దేశంతోనే అది మనకు ఇవ్వబడింది. ఇది ప్రేమ మరియు ఇంద్రియ నిగ్రహములతో సమన్వితమై దేవుని ఉద్దేశమునుబట్టి మనకు ఇవ్వబడింది. స్వలాభాపేక్షతోనో లేదా ఇతరుల ముందు ప్రదర్శించాలన్న కోరికతోనో ఈ శక్తిని ఒక వ్యక్తి అన్వేషించరాదు. ఇది ఒక వ్యక్తి ఈ లోకంలో మేధావిగాను విజయుడుగాను జీవించేందుకు ఉద్దేశించ బడిన శక్తికాదుగాని, ఒక విశ్వాసి ఆనందంతో కూడిన దీర్ఘశాంతమును మరియు ఓర్పును కనపరచుట కొరకు ఇది ఉద్దేశించబడినది. ఈ శక్తిని మనకివ్వడంలో దేవుని ఉద్దేశం మానవుని ఆలోచనలకు భిన్నమైనది. దీనిని మనము మన ఆలోచనల ప్రకార ముకాక దేవుని ఉద్దేశము ప్రకారం మాత్రమే గైకొనాలి.

# అపొస్తులుల కార్యముల గ్రంథంలో బయలుపరచబడిన ఆత్మీయశక్తి

ఆ రోజుల్లో విశ్వాసులు చాల విషయాల్లో ఆత్మీయ శక్తిచేత నడిపించబడినట్లు అపొస్తులుల కార్యముల గ్రంథంలోని ప్రారంభాధ్యాయాలు మనకు తెలుపుతున్నాయి. వాటిలో కొన్నింటిని ఈ క్రింది పటంలో వివరంగా చూద్దాం.



పటము - 2

అపో.కా. 2:42 లో ఈ విధంగా వ్రాయబడింది : “వీరు అపొస్తలుల బోధ యందును, సహవాసమందును, రొట్టెవిరచుటయందును, ప్రార్థనచేయుట యందును ఎడతెగక యుండిరి.” తిరిగి 46,47 వచనాలలో “వారేక మనస్కులై ప్రతి దినము దేవాలయములో తప్పక కూడుకొనుచు, యింటింట రొట్టె విరుచుచు, దేవుని స్తుతించుచు, ప్రజలందరివలన దయపొందినవారై ఆనందముతోను, నిష్కపటమైన హృదయముతోను ఆహారము పుచ్చుకొనుచుండిరి” అని వ్రాయబడి ఉంది. ఈ **“సహవాసంలోని శక్తి”** మనలో చాలాసార్లు కొరతగా ఉన్నది.

మనము నిజాయితీగా మన ఆత్మీయస్థితిని అంచనా వేసుకోవాలంటే మనలోని మభ్యపెట్టుకొనే స్వభావాన్ని మనం విడిచిపెట్టాలి. మన పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్న ప్పుడు అన్నీ సవ్యంగా ఉన్నట్టు మనం నటించరాదు. మన అంతర్యం సత్యంతో నిండి యుండాలని దేవుడు ఆశిస్తున్నాడు. ఆయనకు వాస్తవాలు కావాలి. మన పరిస్థితి సరిగాలేనప్పుడు దాన్ని మనం అంగీకరిద్దాం. మన పరిస్థితి బాగున్నట్లయితే దానికొరకు దేవుని స్తుతిద్దాం.

అపొస్తలుల కాలంలోని క్రైస్తవులను గమనిస్తే, వారి పరిస్థితి అన్ని విషయాల్లోనూ చాల చక్కగా ఉన్నట్టుగా మనం చూడగలం. "సహవాసంలోని శక్తి"ని అనుభవిస్తూనే "ప్రార్థనా శక్తి"ని కూడా వారు అనుభవించారు. **"వారు ప్రార్థించగా వారు కూడు కొనివున్న స్థలం కంపించింది"** (అపొ.కా. 4:31). ఇక్కడ **"కంపించడం"** అనే ప్రక్రియ వారి అనుభవంలో వాస్తవంగా జరిగిందా, లేక అది ఆత్మీయతా, లేక ఆ విషయం యిక్కడ సాదృశ్యంగా చెప్పబడిందా, లేక అది ఈ మూడింటి కలయికా అనేది మనకు తెలియదుగాని, ఒక్క విషయంమాత్రం మనం కచ్చితంగా గ్రహించగలం. తాము ధైర్యంగా వాక్యం ప్రకటించునట్లు వారు ప్రార్థించారు. ఫలితంగా వారు వాక్యాన్ని ధైర్యంగా ప్రకటించగలిగారు.

**'ప్రార్థనాశక్తి'** కొన్ని ప్రత్యేకమైన అంశాల కొరకై పట్టుదలతో దేవుని ప్రార్థించి వాటిని పొందుతుంది. మనము కొన్ని ప్రత్యేకమైన అంశాలకొరకై పట్టుదలగా ప్రార్థించి పొందాలని దేవుని చిత్తము. అయితే, మన అవిశ్వాసాన్నిబట్టి అలా ప్రార్థించడానికి భయపడి సాధారణమైన విషయాలకొరకే మనము ఎక్కువ ప్రార్థిస్తుంటాం. "మనం అడిగేవి దేవుడు యివ్వకపోతే!" అని మనం అనుమానపడుతుంటాం. 1 యోహాను 5:14,15 లో యిలాగున వ్రాయబడి ఉంది : **"ఆయననుబట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా ఆయన చిత్తానుసారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మనమెరిగినయెడల మనమాయనను వేడుకొనినవి మనము పొందుదుమని ఎరుగుదుము."** మనకు వాస్తవంగా దేవునిపై నమ్మకముందా? అలా ఉన్నట్టయితే నిర్దిష్టమైన విషయాలకై పట్టుదలతో దేవుని ప్రార్థిద్దాం.

ఆదిశిష్యులు తమ సమస్యలను పరిష్కరించుకొనే శక్తిని కూడా కలిగియుండిరి. ఈనాడు సంఘాల్లో మనం ఎదుర్కొంటున్న సమస్యల్నే ఆనాడు వారుకూడ ఎదుర్కొంటూ వచ్చారు. ఉదాహరణకు, తాము సంఘముచే నిర్లక్ష్యం చేయబడ్డామని కొందరు విధవ రాండ్రు ఫిర్యాదు చేసినట్లుగా అపొ. కా. 6:1-3 లో వ్రాయబడి ఉండటాన్ని మనం

చూస్తున్నాం. తమకన్నా యితర విధవరాండ్రు ఎక్కువ ప్రయోజనాలు పొందుతున్నట్టుగా వారు ఫిర్యాదుచేశారు. వారి సమస్యను పరిష్కరించడంలో ప్రారంభ విశ్వాసులు ప్రదర్శించిన ఆత్మీయశక్తి చాల గొప్పది. సంఘములోని విధవరాండ్రందరికీ సమానంగా పంచేందుకుగాను విశ్వాసముతోను, పరిశుద్ధాత్మతోను, జ్ఞానముతోను నిండుకొని మంచి పేరు పొందిన ఏడుగురు సహోదరులను వారు ఏర్పరచుకొన్నారు. అంతే, సమస్య పరిష్కారమైంది. మన మధ్యలో తరచుగా ఉత్పన్నమయ్యే మన సమస్యల్ని ఆత్మీయశక్తితో పరిష్కరించుకొనేందుకు మనమెన్నిసార్లు ప్రయత్నించాము?

**సాక్ష్యమిచ్చుటలోకూడ వారు ఆత్మీయ శక్తి** ని కలిగియుండిరి. స్తెఫెనును రాళ్ళతో కొట్టి చంపుటవలన ప్రారంభమైన హింస ఫలితంగా చెదిరిపోయిన విశ్వాసులు సువార్తను ప్రకటిస్తూ అన్ని ప్రాంతాల్లో సంచరించారు (అపొ.కా. 7:54–8:4). **"సాక్ష్యమివ్వడం జార్జిగారి పని, నేను సాధారణ క్రైస్తవుణ్ణి"** అని వారిలో ఎవరునూ అనలేదు. సువార్త ప్రకటించే బాధ్యతను వారు ఒకరిపైనొకరు నెట్టుకొనలేదు. సువార్తను వేరెవరో ప్రకటిస్తారని, తానొక సాధారణ క్రైస్తవుడిగా జీవిస్తే చాలునని వారిలో ఎవరూ తలంచలేదు. క్రీస్తును వారు ప్రాణప్రదంగా ప్రేమించారు గనుక సువార్తను ప్రకటించేందుకు భయపడక ప్రభువును యితరులకు తెలిపేందుకు వారు యిష్టపడ్డారు.

అంతిమంగా, ప్రారంభ విశ్వాసులు తమ **వాస్తవ నడతల్లో ఆత్మీయ శక్తి** ని కలిగియుండిరి. వారు ప్రభువునందలి భయముతోను, పరిశుద్ధాత్మయొక్క ఆదరణలోను నడిచారు. ఫలితంగా, సంఘాలు కట్టబడ్డాయి, అవి దేవుని సమాధానంతో నింపబడ్డాయి. (అపొ.కా. 9:31).

## అలాంటి ఆత్మీయశక్తి ఇప్పుడు మనకెందుకు లేదు?

అపొస్తలుల కార్యముల గ్రంథాన్ని మనము గమనించినప్పుడు, **"స్థానిక సంఘాల్లో అలాంటి ఆత్మీయశక్తిని ఈ రోజుల్లో మనమెందుకు అనుభవించలేకపోతున్నాం?"** అని మనల్ని మనం ప్రశ్నించుకొంటాం. అన్ని ప్రశ్నలకూ జవాబునిచ్చే పరిశుద్ధ గ్రంథాన్ని మనం పరిశోధించి ఆ వాక్యపు వెలుగులో మనం అంచనా వేసికొనేందుకు ప్రయత్నించినప్పుడు దేవుడు తప్పక మన ప్రశ్నకు జవాబును అనుగ్రహిస్తాడు. ఆనాడు ఉన్న ఆత్మీయశక్తి ఈనాడు మనలో లేకపోవడానికిగల కొన్ని కారణాలు 3వ పటంలో చూపబడ్డాయి. ఈ కారణాలుగాక యింకా కొన్ని కారణాలుకూడా ఉండవచ్చుగాని, వీటిని ప్రాముఖ్యమైన కారణాలలో కొన్నింటిగా మనం చెప్పుకోవచ్చు. (దయచేసి తరువాతి పేజీలోని పటము చూడండి).

## ఈ రోజుల్లో ఆత్మీయశక్తి లేకపోవడానికిగల కొన్ని కారణాలు

**1** అపాయకరమైన దినములు ...
అంత్యదినములు ...
నాశనము ... వెడలుట ...
2 తిమోతి 3,4; ప్రకటన 3:14-22

**2** సంఘములో విభజనలు ...
కనిపించని ఐక్యత ...
అపో.కా. 20:29,30;
1 కొరింథీ. 1:9-13

**3** తప్పుడు బోధకులు మరియు
తప్పుడు పద్ధతులు ...
2 పేతురు 2,3;
1 యోహాను 2:18-23

**4** అతి తక్కువ హింస ...
అపో.కా. 8:3,4

**5** వాక్యానుసారమైన సంఘ
సత్యాలను నిర్లక్ష్యము
చేయుట మరియు / లేదా
తప్పుగా అర్థము చేసికొనుట

ప్రాథమిక సూత్రాలు .... ఎఫెసీ. 1:18-13
ప్రాముఖ్యతలు ......... ఎఫెసీ. 4:11-16
ధృక్పథాలు ............ ఎఫెసీ. 4:1-3
ప్రాధాన్యతలు ...... 2 తిమోతి 3:16,17
సువార్త ప్రకటించుట .... 1 థెస్స. 1:5-9

**పటము - 3**

ఈనాడు మనలో ఆత్మీయశక్తి కనిపించకపోవడానికి ముఖ్యమైన కారణం, లేఖనాలు హెచ్చరిస్తున్న **"అపాయకరమైన దినాల్లో"** మనం నివసించడమే. ప్రస్తుత మన కాలాన్ని వర్ణించడానికి **"కడవరి దినాలు"**, **"నాశనకరమైన దినాలు"** అనే మాటలను మనం ఉపయోగిస్తాం. మనం ప్రస్తుతం జీవిస్తున్నది మొదటి శతాబ్దంలో కాదుగాని, 21వ శతాబ్దంలోనేనని మనందరికీ తెలుసు. సంఘాలు అపొస్తలత్వముయొక్క స్వచ్ఛతను, ఆత్మీయశక్తిని నింపుకొన్న దినాల్లో మనం జీవించడం లేదుగాని, క్రీస్తు సంఘంయొక్క హింసా కాలంగా చెప్పబడుతున్న కాలానికి 2000 సంవత్సరాల తర్వాత మలినమైన చరిత్ర కలిగిన సమాజము క్రైస్తవ సంఘంగా చెప్పుకొను సంఘ కాలంలో మనం జీవిస్తున్నాం. ప్రశస్తమైన మన రక్షకుని పేరు ఆయనకు ప్రతినిధులుగా ఉన్న క్రైస్తవులద్వారా గత 2000 సంవత్సరాల్లో చాల అవమానపరచబడింది.

కాబట్టి, 2 తిమోతి 3,4 అధ్యాయాల్లో చెప్పబడిన అపాయకరమైన దినాల్లోను, ప్రకటన 3:14-22 లో చెప్పబడిన లవొదికయ సంఘ కాలంలోను మనం నివసిస్తున్నాము. దైవసంబంధమైన కార్యాలకన్నా నులి వెచ్చని స్థితికీ ప్రగల్భాలు పలికే స్థితికీ ఈ కాలం గుర్తుగా ఉంది. లవొదికయ సంఘంతో ప్రభువు ఇలా అంటున్నాడు : **"నీవు**

**దౌర్భాగ్యుడవును, దిక్కుమాలినవాడవును, దరిద్రుడవును, గ్రుడ్డివాడవును, దిగంబరుడవునై యున్నావని ఎరుగక —నేను ధనవంతుడను, ధనవృద్ధి చేసియున్నాను, నాకేమియు కొదువలేదని చెప్పుకొనుచున్నావు"** (ప్రక. 3:17).

అటువంటి కాలం వస్తుందని పౌలు ముందే ఊహించి, ఎఫెసీ సంఘంలోని పెద్దలను ఈ రీతిగా హెచ్చరించాడు : **"నేను వెళ్ళిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్ళు మీలో ప్రవేశించునని నాకు తెలియును; వారు మందను కనికరింపరు. మరియు శిష్యులను తమ వెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలుదేరుదురు."** (అపొ.కా. 20:29, 30). వారి అవిశ్వాసాన్నిబట్టి యూదులను తనకు సాక్షులుగా ఉండకుండా తాను విసర్జించిన రీతిగా అన్యజనులనుకూడ వారి అవిశ్వాసాన్నిబట్టి విసర్జింతునని ప్రభువు అదే స్థాయిలో హెచ్చరించాడు. రోమా 11:20,21 లోని ఆయన మాటలను జాగ్రత్తగా పరిశీలించుము : **"గర్వింపక భయపడుము; దేవుడు స్వాభావికమైన కొమ్మలను విడిచి పెట్టనియెడల, నిన్నును విడిచిపెట్టడు."**

దేవుని విశ్వాసములో కొనసాగని క్రైస్తవ సమాజం (నామకార్థంగా క్రీస్తునామాన్ని హత్తుకొన్నవారి గుంపు) విసర్జింపబడునని మనకిక్కడ స్పష్టమౌతుంది. నిజమైన విశ్వాసులు విసర్జింపబడుదురని దీని అర్థం కానందుకు దేవునికి కృతజ్ఞతలు. యేసుప్రభువునందు నిజముగా విమోచింపబడినవారందరు ఆకాశమండలములో ప్రభువు నెదుర్కొనుటకును, ఆ తర్వాత ఆయనతోకూడ సదాకాలము ఉండుటకును కొనిపోబడుదురు (1 థెస్స. 4:17). ఏది ఏమైనప్పటికీ, దేవుని సంఘాన్ని విఫలమైందిగాను, క్రైస్తవ్యాన్ని దేవునికి దూరమైందిగాను ప్రపంచం గుర్తిస్తున్న దినాలలో మనం ఉన్నాము.

కొందరు ఆధునిక రచయితలు ప్రస్తుత కాలాన్ని క్రైస్తవ్యపు తదుపరి శకంగా అభివర్ణిస్తున్నారు. 'క్రైస్తవ్యపు తదుపరి శకం అంటే ఏంటి?' అని ఆశ్చర్యపడనవసరం లేదు. "మూడవ ప్రపంచం"గా పిలువబడుతున్న ఆఫ్రికా, ఆసియా ఖండాల విషయంలో ఒకవేళ యిది నిజం కానప్పటికీ, ఆచార వ్యవహారాల్లోనూ చారిత్రికంగానూ దేవుని కృపనెరిగిన క్రైస్తవ దేశాలుగా పిలువబడుతున్న ఇంగ్లాండు, జర్మనీ, కెనడా, ఆస్ట్రేలియా, అమెరికా మొదలగు దేశాలు వారి సామాజిక మరియు సంస్థాగత జీవితాల్లో దేవుని సత్యంనుండి ప్రక్కకు తొలగి క్రైస్తవ సిద్ధాంతాలకూ విశ్వాసానికీ చాల దూరమౌతున్నాయి.

దేవుని ప్రజలు తమ సాక్ష్యంలోను, తాము ఫలభరితమైన జీవితం జీవించుటలోను ఆత్మీయశక్తిని కలిగియుండక పోవడానికిగల మరియొక కారణం వారిలోని **అనేక విభజనలు.** నీవెవరితోనైనా, "నేను క్రైస్తవుడను, ఫలానా భవనంలో సహోదరులతోకూడ

**ఆరాధనకు కూడుకొంటున్నా**"నని చెప్పినట్లయితే వారిచ్చే జవాబు, **"మీ సంఘం గురించి తెలిసికోవడం చాల సంతోషం. అయితే, 3 కిలో మీటర్ల పరిధిలో యిలాటి చిన్న సంఘాలు యింకనూ ఒక డజను ఉన్నాయని నీకు తెలుసా?"**

ప్రతి నిజమైన దేవుని బిడ్డకోసం ఆయనకు కృతజ్ఞతలు. కాని, ఎవరికివారు తమ సంఘం సత్యమైందని చెప్పుకొనే వివిధమైన గుంపులతోను, వర్గీకరణలతోను దేవుని ప్రజలు చెదిరియుండగా దేవుని సంఘసత్యాన్ని గురించి యితరులతో మాట్లాడ్డం కష్టమైన విషయం కాదా? ఈ విభజింపబడిన గుంపులలో అతి కొద్దిమంది క్రైస్తవులు మాత్రమే దేవుని వరము కలిగిన దైవసేవకులచే ఆత్మీయంగా బలపరచబడుతున్నారు. దేవుని ప్రజల మధ్య మాటల్లోనూ, క్రియల్లోను కొరతగానున్న ఐక్యత దేవుని సంఘాన్ని చాల బలహీనపరస్తూ ఉంది.

యోహాను 17:21 లో ప్రభువైన యేసు ఈ విధంగా ప్రార్థించాడు : **"నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు తండ్రీ నాయందు నీవును, నీయందు నేనును ఉన్నలాగున వారును మనయందు ఏకమై యుండవలెను."** దేవుడు మనల్ని ఒకటిగా చూచినప్పటికీ, ఈ లోకం దృష్టికి మనం ఒకటిగా కనిపించడం లేదు. క్రైస్తవులు బహిరంగంగా తగాదాలాడుకొంటూ, ఒకరినొకరు విమర్శించుకొంటూ ఉంటారు. లోకం యిదంతా చూసి, "ఇలాంటి వారి పొత్తు నాకొద్దు" అని దూరంగా వెళతారు. యోహాను 13:35 లో చెప్పబడిన దేవుని సత్యాన్ని ప్రదర్శించడంలో మనం విఫలమౌతున్నాం : **"మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైనయెడల దీని బట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురు."**

సంఘంలో ఐక్యత లోపించిన దినాల్లో మనం నివసిస్తున్నప్పటికీ, క్రీస్తుయొక్క ఒకే శరీరంపై ఆధారపడి, ఆయన వాగ్దానసన్నిధి మనమధ్య ఉండగా మనమందరము ఒకటిగా కూడుకొనుట యింకను సాధ్యమైన విషయమే. దీన్ని గురించి తదుపరి పేజీల్లో వివరంగా చూద్దాం.

మనలో ఆత్మీయశక్తి కొరతగా ఉండుటకు మరొక కారణం, మన సంస్కృతిలో వ్యాపించి మనలను ప్రభావితం చేస్తోన్న **తప్పుడు ఆరాధనా పద్ధతులు** మరియు **తప్పుడు బోధకులు.** గృహాల్ని దర్శిస్తూ, పత్రికలు పంచుతున్న సమయంలో నీవు దర్శించిన ఒక గృహాన్ని నీలాంటి ఒక సహోదరుడు యిదివరకే దర్శించి ఉన్నట్లయితే, **"నీకన్నా ముందుగా ఒక వ్యక్తి యిచ్చిన కరపత్రం ఈ విధంగా చెబుతోంది. మరి నీ కరపత్రం ఏమని చెబుతోంది?"** అని ఆ గృహస్థులు నిన్ను ప్రశ్నిస్తారు. అప్పుడు, **"వారు అబద్ధికులు. సరైన సత్యాన్ని వారు మీకు అందివ్వడం లేదు"** అని మీరంటారు. **"అవును, మీ గురించి వారు చెప్పేదికూడ అదే"** అని వారు కోపంతో మీరిచ్చిన కరపత్రాన్ని మీపై విసిరికొడతారు.

క్రీస్తు సంఘానికి గొప్ప నష్టాన్ని కలిగించే అబద్ధ బోధకులు మరియు తప్పుడు ఆరాధనా పద్ధతులు మనలో ఉన్నాయన్న వాస్తవాన్ని మనం త్రోసివేయలేము. వారిని అడ్డుకోవాలని మనం అనుకొంటున్నాం. కాని అడ్డుకోలేకపోతున్నాం. కోతసమయం వరకు ఈ లోకంలో గోధుమలు మరియు గురుగులు ఒకటిగా కలసి ఎదుగుతాయని ప్రభువు చెప్పాడు (మత్తయి. 13:30). అయినను దీని ఫలితంగా వచ్చే గలిబిలినీ బలహీనతనూ మనం ఒప్పుకొన్నప్పుడు, దేవుని ఆత్మ తప్పక మనమధ్య పనిచేసి, ఆత్మ లను ప్రభువైన యేసునొద్దకు నడిపించడాన్నీ, మనం అందుబాటులో ఉండుకొలదీ ఈ ఆశీర్వాదకరమైన పనిలో ఆయన మనల్ని ఉపయోగించుకోవడాన్నీ మనం చూసి ఆనందించగలం.

మనలో ఆత్మీయశక్తి కొరతగా ఉండటానికిగల మరొక కారణం, దేవుని సంఘాలు ఈ రోజుల్లో **అతి తక్కువ హింసను అనుభవించడం** లేదా **అస్సలు హింసను అనుభవించకపోవడం**. ప్రారంభ దినాల్లో సంఘము హింసించబడుటనుబట్టి క్రైస్తవులు ఆయా ప్రాంతాలకు చెదిరిపోయారని అపొ.కా. 8:3,4 చెబుతోంది. ఈ రోజుల్లో అటువంటి హింసను మనం ఎదుర్కొనడం లేదు. క్రీస్తునుగూర్చి మాట్లాడినందుకు ఎప్పుడో ఒకసారి ఎవరైనా మనల్ని హేళనచేయడం లేదా బెదిరించడం జరుగుతోంది తప్ప, అంతకుమించిన అవమానం లేదా హింస మనకు ఎదురవడం లేదు. క్రీస్తునామాన్ని భరించుటలో దూషణలు, నిందలు, అవమానములు, హింసలు, కష్టాలు ఉన్నాయి. **“నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి, హింసించి మీమీద అబద్ధముగా చెడ్డమాట లెల్లపలుకుదురు”** అని నిజానికి ప్రభువు తానే స్వయంగా హెచ్చరించాడు (మత్తయి 5:11).

ఏది యేమైనను, మనమీనాడు అనుభవిస్తున్న హింసనుగూర్చి వ్యక్తపరచవలసి వస్తే మనం సిగ్గుతో తలవంచుకోవలసి వస్తుంది. చైనా, మొరొకో, సౌది అరేబియా లాంటి దేశాల్లో విశ్వాసులు రహస్యంగా కూడుకోవాలి. బైబిళ్ళు అతికొద్ది సంఖ్యలో లభ్యమౌతున్నందున ప్రశస్తమైన దైవవాక్యంలోని ఏ చిన్న భాగం వారికి దొరికినా దాన్ని వారు ఒక నిధిలాగా అతి జాగ్రత్తగా భద్రంచేసుకొంటారు. క్రీస్తుకొరకు జీవించ డానికి ఉద్యోగాలు, పిల్లల చదువులు, స్వేచ్ఛా జీవితం, చివరకు ప్రాణంకూడ పోగొట్టుకొనే పరిస్థితులున్న ఆ దేశాల్లోని పరిశుద్ధులతో మనం పోల్చుకొన్నప్పుడు, క్రీస్తుకోసం మనమేమాత్రం శ్రమపడటం లేదన్నది వాస్తవం.

పాశ్చాత్య దేశాల్లో క్రైస్తవులకు హింస ప్రారంభమైనట్లయితే, అది నిజ క్రైస్తవులను అబద్ధ క్రైస్తవులనుండి వేరుచేస్తుంది. అయితే, దీన్ని మనం స్వాగతిస్తున్నామా? మనమా

హింసను నిజంగా ఆహ్వానించడం లేదు. 'హింస' కావాలని మనం ఆశించడం లేదు. పోలీసులు మన యిళ్ళల్లోకి చొరబడి, మనలను మన కుటుంబాలతోసహా కారాగారాలలో బంధించే రోజులు రావాలని మనం ప్రార్థించడం లేదు. క్రీస్తుకోసం మనం అతికొద్ది శ్రమననుభవిస్తున్నందున, అతి కొద్ది విశ్వాస్యతనూ అతికొద్ది అంకితభావాన్నీ మనము కలిగియున్నామని మనము తప్పక ఒప్పుకోవాలి. "**నేను యేసుయొక్క ముద్రలు నా శరీరమందు ధరించియున్నాను, ఇకమీదట ఎవడును నన్ను శ్రమపెట్ట వద్దు**" (గలతీ. 6:17) అని పరిశుద్ధుడైన పౌలు అంటున్నాడు. అలాటి ముద్రలనుగూర్చి మనకేమైనా తెలుసా?

మనలో ఆత్మీయశక్తి లోపించడానికిగల చివరి కారణం : **'దేవుని వాక్యాన్ని మనం అశ్రద్ధ చేయడం లేదా తప్పుగా అర్థం చేసికోవడం'.** ముఖ్యంగా సంఘ ప్రాథమిక సూత్రాలు, ప్రాముఖ్యతలు, దృక్పథాలు, ప్రాధాన్యతలు, సువార్త ప్రకటించుట అనే విషయాల్లో సంఘానికి దేవునివాక్యం ఏమి బోధిస్తోందో మనం సరిగా అర్థం చేసికోలేక పోతున్నాం. సంఘ ప్రాథమిక సూత్రాలనూ, వాటి ఆచరణ విధానాలనూ మనం అర్థం చేసికోనట్లయితే మనం సంఘ సత్యాన్ని అనుసరించడం అసాధ్యం.

## దేవుని శక్తి లోపించడాన్ని గురించి మనం చేయగలిగినవి, చేయలేనివి :

4వ పటంలో చూపబడిన రీతిగా ఆత్మీయశక్తి మనలో లోపించడానికిగల కొన్ని కారణాల విషయంలో మనమేమీ చేయలేము. మనం చరిత్రను మార్చలేము లేదా కాలచక్రాన్ని వెనక్కి త్రిప్పలేము. అపాయకరమైన దినాల్లో మనం జీవిస్తున్నామన్న వాస్తవాన్నిగాని, వేషధారణతోను అబద్ధపు బోధకులతోను విభజనలతోను క్రైస్తవ సంఘాలు ఉన్నాయన్న వాస్తవాన్నిగాని మనం మార్చలేము. మనల్ని మనం శుద్ధిచేసికొనేందుకు సాధనమైన హింసనుకూడా మనం ఆహ్వానించలేము.

అయితే, మనమాయనకొరకు నమ్మకమైన సాక్ష్యం కలిగియుండుటకు దేవుడు మనకిచ్చినవాటన్నింటికీ సరైనవిధంగా స్పందించడంద్వారా మనమేమైనా చేయగలం.

మనమేదో నూతనమైనవి సృష్టించాలని ప్రయత్నించ కూడదుగాని, మనగురించి మనమేమాత్రం అతిశయింపక, సంఘ వైఫల్యానికీ నాశనానికీ బాధ్యత వహిస్తూ, దేవుని కృపద్వారా ఆదినుండి ఉన్నవాటిపైనే కట్టుటకు ప్రయాసపడాలన్న ప్రాముఖ్యమైన మూలసూత్రాన్ని గత శతాబ్దపు సహోదరులు మనకు తెలిపారు. కొన్నిసార్లు సంఘ

| మనలో ఆత్మీయశక్తి లోపించడాన్ని గురించి మనం చేయగలిగినవి మరియు చేయలేనివి | |
|---|---|
| **మనమేమీ చేయలేనివి** | **మనం చేయగలిగినవి** |
| • అపాయకరమైన దినములు మొదలగునవి | • ప్రాథమిక సూత్రాలు |
| • సంఘాలలో విభజనలు | • ప్రాముఖ్యతలు |
| • తప్పుడు బోధకులు | • దృక్పథాలు |
| • హింస | • ప్రాధాన్యతలు |
| | • సువార్త ప్రకటించుట |

**పటము - 4**

నాశనము గురించి మాట్లాడునప్పుడు, మన గుంపుకు చెందినవారుతప్ప మిగిలిన వారంతా బాధ్యులన్నట్టుగా మనం మాట్లాడతాం. అలాకాదుగాని, దానిలో మనంకూడ భాగస్థులమే. దీన్ని మనం ఎంత ఎక్కువగా గుర్తిస్తామో అంత ఎక్కువగా ప్రార్థనతోను దీనత్వంతోను దేవుని పాదాలను ఆశ్రయిస్తాం.

దానియేలు ప్రార్థన ఈ విధమైన దృక్పథానికి ఒక మంచి ఉదాహరణ (దానియేలు 9:3-19). దేవుని సన్నిధిలో అతడు ఒప్పుకొన్న తప్పిదాల విషయమై వ్యక్తిగతంగా అతడేమాత్రం నేరస్థుడుకాడు. అయినప్పటికీ అతడిలా ప్రార్థించాడు : "**ప్రభువా, నీకు విరోధముగా పాపము చేసినందున మాకును, మా రాజులకును, మా అధిపతులకును, మా పితరులకును ముఖము చిన్నబోవునట్లుగా సిగ్గే తగి యున్నది ... అయితే ఆయన కృపాక్షమాపణలుగల దేవుడై యున్నాడు**" (దానియేలు 9:8,9). తానుగాని, ఇశ్రాయేలీయులుగాని అర్హులమన్నట్టుగాక, దేవుని కృపను మాత్రమే ఆధారంచేసికొని దానియేలు పూర్ణహృదయంతో దీనాతిదీనంగా దేవుణ్ణి బతిమాలుతున్నాడు. అదేవిధంగా అనేక విషయాల్లో మనమేమీ చేయలేని నిస్సహాయులమైనప్పటికీ, వాస్తవ పరిస్థితులనూ వైఫల్యాల విషయంలో మన బాధ్యతనూ మనం గుర్తించగలం. అప్పుడు దేవుని సంపూర్ణ సత్యమార్గంలో మనం నడువగలం.

దేవుని సత్యాన్ని అర్థం చేసికొని దాని ప్రకారం నడుచుకోవడం అనగానేమో ముందున్న అధ్యాయాల్లో మనం చూద్దాం. దానికి ముందు అంచనా వేయుటనుగూర్చి మరొక విషయాన్ని పరిశీలించవలసిన అవసరతవుంది.

## అంచనా వేసికొనుటయొక్క గమ్యములు

అంచనా వేసికొనుటలో నాకు తెలిసిన మూడు గమ్యములు 5వ పటంలో చూపించ బడ్డాయి. ఆ మూడు గమ్యములు ఏవనగా :

- **విమర్శకాదు – ఒప్పుకోలు**
- **పరిపూర్ణతకాదు – అభివృద్ధి**
- **ఇతరులతో పోల్చుకోవడం కాదు – దేవునివాక్యంతో పోల్చుకోవడం (2 కొరింథీ 10:12).**

ఇతరులను విమర్శించుటకన్నా దేవునియెదుట తప్పిదాలు ఒప్పుకోవడం అనే గమ్యం ఆచరణకు అంత సులభంకానప్పటికీ అర్థంచేసికోవడానికి చాల సులభం. **'పరిపూర్ణతకాదు – అభివృద్ధి'** అన్న ఆలోచనకు కొంత ఎక్కువ వివరణ అవసరం.

**అంచనా వేసికొనుటయొక్క గమ్యములు**

- **విమర్శకాదు – ఒప్పుకోలు**
- **పరిపూర్ణతకాదు – అభివృద్ధి**
- **ఇతరులతో పోల్చుకోవడం కాదు – దేవునివాక్యంతో పోల్చుకోవడం**



**పటము - 5**

ఫిలిప్పీ 3:12–14 లోని పరిశుద్ధుడైన పౌలు మాటలను ఆలోచించెదము. ఈ భూమిమీద తన వాస్తవ పరిస్థితిని పరిశీలించినప్పుడు (దేవుని యెదుట తన స్థితిని కాదు), తానింకను పరిణతి చెందలేదని అతడు గ్రహించాడు. అందుచేత తనపట్ల దేవుని ఉద్దేశాలను నెరవేర్చేందుకు గురియొద్దకు అనగా క్రీస్తుయేసునందలి దేవుని ఉన్నతమైన పిలుపుయొక్క బహుమానమునొద్దకు పరుగెత్తాడు.

అదేవిధంగా దేవుని కొరకైన సాక్ష్యంలోను, తామెక్కడ తొట్రిల్లి తప్పిపోయామో తెలుసుకోవడంలోను, దేవుని సత్యానికి ఎలా దూరమయ్యామో పరీక్షించుకొనే విషయం

లోను స్థానిక సంఘాలు తమ్మును తాము జాగ్రత్తగా పరిశీలించుకొని తమ వాస్తవ పరిస్థితిని అంచనా వేసుకోవలసిన అవసరత ఉంది. సంఘాల్లో జరిగే కూడికలన్నింటిలో ఈ అంశం చాల శక్తివంతమైన అంశమని నేను విశ్వసిస్తున్నాను.

మనలో స్థానిక సంఘంపట్ల భారము మరియు అసక్తి కలిగినవారు తామింకా గమ్యం చేరలేదని గ్రహించాల్సిన అవసరత ఉంది. అందుచేత మనం ఎక్కువగా దేవుని సన్నిధిలో ఓపికతో వేచివుండి, దేవుడు మనతో చెప్పాలని ఆశించిన విషయాలను శ్రద్ధగా వినాలి. మనము ఈ క్రింది ప్రశ్నలను మనకు మనం సంధించుకోవాలి : **"మనం సమాజంగా కూడుకొన్నప్పుడే గాక, మన అనుదిన జీవితాల్లోకూడ ప్రభువైన యేసు నిజంగా మహిమపరచబడి గౌరవించబడుతున్నాడా? మన వాక్యపఠనాలు, సేవాకూడికలు, బోధనా సమావేశాలు నిజంగా సంఘాన్ని పోషిస్తున్నాయా? వివిధ సేవా కార్యక్రమాలను సమర్థ వంతంగా నిర్వహించేందుకు దేవుని ప్రజలు సంఘంలో బలపరచబడుతున్నారా? మన స్థానిక సంఘం ఆత్మీయ అవసరతలో ఉన్నవారికి ఒక ఆశ్రయదుర్గంగా ఉందా లేక చూసేవారికి అది కేవలం ఒక సాంఘిక సేవాసంస్థలాగా ఉందా? ఫిలిప్పీ 1:5 లో పరిశుద్ధుడైన పౌలు మనకు అప్పగించిన 'సువార్తలోని సహవాసాన్ని' మన పరిచర్య ద్వారా మనము యితరులకు బయలుపరచ గలుగుతున్నామా?"** – ఇలా అన్ని విషయాలలో పరిశుద్ధాత్ముని చిత్తాన్ని కనుగొనేందుకు అంతియొకయలోని ప్రవక్తలు మరియు బోధకులు ఎలా ఉపవాసముతో ప్రభువును సేవించారో అదేరీతిగా పరిశుద్ధాత్ముని నడిపింపుకొరకు మనమును ఉప వాసముతో ప్రభువును సేవించుదుముగాక (అపో.కా. 13:1,2).

మన గమ్యాలను మనం అంచనా వేసుకొనునప్పుడు, ఇతరులుచేసే కార్యక్రమాలను మనము గమనించుటద్వారా మనము మన సమయాన్ని వృధాచేయడమేగాక చివరకు నిరుత్సాహాన్ని ఎదుర్కొంటాము. "వారి కార్యక్రమాలు ఎంత అద్భుతంగా ఉన్నాయి! వారి సేవ ఎంత గొప్పగా ఉంది! ఆత్మలుకూడ రక్షించబడుతున్నాయి!" అని ఇతరులు చేసే సేవను మనం గొప్పచేసి చూస్తూ, మనం అలా చేయలేకపోతున్నామని నిరుత్సాహ పడుతుంటాం. దేవుడు తన ప్రజల మధ్య ఆయా వ్యక్తులద్వారా చేసే కార్యాలను గమ నిస్తూ, వాటిద్వారా మనం నేర్చుకోవాలని ఆసక్తి కలిగివుండడం మంచిదే అయినప్పటికీ, మన సేవను మనం యితరులతోగాక లేఖనములతో పోల్చుకోవడం చాల ప్రాముఖ్యం. కీర్తనలు 119:59 లో కీర్తనకారుడు యిలా అంటున్నాడు : **"నా మార్గములు నేను పరిశీలన చేసికొంటిని; నీ శాసనముల తట్టు మరలుకొంటిని."**

ఈ విధంగా అంచనా వేసికొన్న తర్వాత, దేవుడు తన వాక్యంద్వారా మనలను పిలిచిన స్థానంలోను మరియు మార్గంలోను మునుపటికన్నా మెరుగైనవిధంగా ప్రభువు

మహిమకొరకు ఆయన రాకడవరకు మనము కొనసాగుదాం. “**కళంకమైనను, ముడతయైనను అట్టిది మరి ఏదైనను లేక పరిశుద్ధమైనదిగాను, నిర్దోషమైనదిగాను, మహిమగలదిగాను**” ఉన్నట్టి సంఘమును ప్రభువు తన యెదుట నిలువబెట్టుకొను సంతోషకరమైన సమయముకొరకై మనము సిద్ధపడి ఎదురుచూద్దాం. (ఎఫెసీ 5:27).